క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 45, బెండ 23, పచ్చిమిర్చి 28, కాకర 23, బీర 23, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 80, క్యారెట్ 33, దొండ 19–23, చిక్కుడు 65, గోకర 25, బీట్‌రూట్ 19, క్యాప్సికం 50, ఆలు 21, దోస 17, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 28, చామగడ్డ 38. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఉద్యోగ విరమణ సన్మానం



సుబ్బలక్ష్మిని సత్కరించిన జీఎస్‌ఐ ఉద్యోగులు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ)లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సుబ్బలక్ష్మి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం రాత్రి జీఎస్‌ఐలోని గోదావరి హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీఎస్‌ఐ జాయింట్ డైరెక్టర్ (పీ అండ్ ఎ) ఎస్.తారకేశ్వర్‌రావు సుబ్బలక్ష్మిని శాలువాలతో ఘనంగా సత్కరించి, ఆమె సేవలను కొనియాడారు. డిప్యూటీ డైరెక్టర్ కబీ రాజ్ సేతీ, ఆర్.శ్రీధర్, నర్సింగ్‌రావు, రాజగోపాల్, బాధాల్‌దాస్, కోబ్రాగడ్, అనిత బిడేకర్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న బాలరాజ్‌యాదవ్

మన్సూరాబాద్: సూర్యాపేట పట్టణానికి చెందిన కె. భార్గవి అనారోగ్యంతో బాధపడుతోంది. పేద కుటుంబానికి చెందిన ఆమెకు మెరుగైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో బాలరాజ్‌యాదవ్‌ను ఆశ్రయించారు. మంత్రి జగదీష్‌రెడ్డి సహకారంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.34 వేలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును బాలరాజ్ యాదవ్ ఆదివారం నాగోలు డివిజన్ రాక్‌టౌన్ కాలనీలోని తన నివాసంతో భార్గవి భర్త శ్యాం సుందర్‌కు అందజేశారు.

మినీట్యాంక్ బండ్ వద్ద క్రేన్ ఏర్పాటు చేయాలి



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐలను సత్కరిస్తున్న రమణారెడ్డి తదితరులు

చైతన్యపురి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించినందుకు గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్టేషన్ ఎస్‌ఐలను శాలువాతో సత్కరించారు. 15 రోజులు నిరంతరం నిమజ్జన ఏర్పాట్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారని రమణారెడ్డి అన్నారు. అలాగే దేవీ నవరాత్రి సందర్భంగా నిమజ్జనం కోసం ఒక క్రేన్ ఏర్పాటు చేసేలా చూడాలని ఇన్‌స్పెక్టర్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బాలరాజు, ఎస్‌ఐలు లక్ష్మయ్య, శ్రీనివాసులు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులకు సత్కారం



ధీరజ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అనయ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు దినేశ్ రాథోడ్, ధీరజ్‌గౌడ్‌లకు హైదరాబాద్ అండర్-19 క్రికెట్ జట్టులో చోటు లభించింది. జైపూర్‌లో జరిగే వినూమాన్కజ్ ట్రోఫీలో ఆడేందుకు హైదరాబాద్ జట్టుకు వారు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హస్తినాపురంలోని అనయ డిగ్రీ కళాశాలలో చైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎంబీ రెడ్డితో పాటు సిబ్బంది దినేశ్ రాథోడ్, ధీరజ్‌గౌడ్‌లను అభినందించి శాలువాలతో సత్కరించారు. క్రికెట్ కోచ్ యూనుస్, సైదిరెడ్డి, రాచాల రామకృష్ణగౌడ్, ఉష, మానస, పద్మ తదితరులు పాల్గొన్నారు.



నాగోలు భాగ్య ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో పరిసరాలను శుభ్రం చేస్తున్న చిన్నారులు



రోడ్డు ప్యాచ్‌వర్కు మరమ్మతులో పాల్గొన్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



కాలనీవాసులతో కలిసి రోడ్డు ఊడుస్తున్న చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా

పరిశుభ్రతే లక్ష్యంగా!



గడ్డిఅన్నారంలో రోడ్డు ఊడుస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వాడవాడలా 'స్వచ్ఛతా హి సేవ'

ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రతే లక్ష్యంగా కాలనీలలో, అపార్ట్‌మెంట్లలో సీనియర్ సిటిజన్స్, యువత, చిన్నారులు శ్రమదానం చేసి తమ పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజాప్రతినిధులు స్థానికులతో కలిసి కాలనీల్లోని రోడ్లను శుభ్రం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొని రోడ్డును ఊడ్చారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ కార్పొరేటర్ సుజాతానాయక్, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ, కొత్తపేట డివిజన్‌లో కార్పొరేటర్ పవన్‌కుమార్ పలు కాలనీల్లో రోడ్లను ఊడ్చి, పరిసరాలను శుభ్రం చేశారు.

–ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల బృందం



నందనవనం కాలనీలో.. కార్పొరేటర్ సుజాతానాయక్ తదితరులు



అంజిరెడ్డి కాలనీలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి



మూసారంబాగ్‌లో... కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు



సైదాబాద్ రెవెన్యూ బోర్డు కాలనీలో.. ఎన్‌ఐఐఎంహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ తదితరులు



నాగోలు రాఘవేంద్ర కాలనీలో .. బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ అరుణ



కొత్తపేట డివిజన్‌లో... కార్పొరేటర్ పవన్‌కుమార్

ఉనికి కోసమే ఎమ్మెల్యేపై ఆరోపణలు: బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్

వనస్థలిపురం: ప్రజలలో ఉనికిని చాటుకోవడానికే బీజేపీ నాయకుడు సామ రంగారెడ్డి పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని, ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఆయనకు కానరావడం లేదని పలువురు బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు విమర్శించారు. ఆదివారం వనస్థలిపురంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన రిజిస్ట్రేషన్ల సమస్యను 118 జీఓతో పరిష్కరించిన ఘనత సుధీర్‌రెడ్డికి దక్కిందని, దానిని జీర్ణించుకోలేక, జీఓపై కనీస అవగాహన లేకుండా రంగారెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి పన్ను తగ్గింపునకు కృషి చేశారని, పన్ను తగ్గించినా రంగారెడ్డికి కనబడటం లేదని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి అభివృద్ధి, సంక్షేమానికి పాల్పడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ప్రజాక్షేత్రంలో వారికి సరైన బుద్ధి చెపుతామని వారు హెచ్చరించారు.

మైనార్టీ మహిళకు ఆర్థిక సాయం

మన్సూరాబాద్: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మైనార్టీ మహిళకు ఎమ్మెల్యే సతీమణి దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేసి అండగా తానుంటానని భరోసా ఇచ్చారు. వివరాలు.. మన్సూరాబాద్ డివిజన్ చింతలకుంటకు చెందిన జహేదాబేగం చిన్నతనంలోనే భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కుటుంబ భారాన్ని మోస్తోంది. విషయం తెలుసుకున్న జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సతీమణి దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి మానవత్వంతో స్పందించి జహిదా బేగంకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాచిగూడ: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర భూమన్నలేన్, లింగంపల్లి రాఘవేంద్రస్వామి టెంపుల్‌లేన్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాలనీల్లో సమస్యలు లేకుండా సీవరేజ్ పైపులైన్ల ఆధునీకరణ, సీసీరోడ్లు, బీటీ రోడ్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని వివరించారు. డాక్టర్ శిరీష ఓంప్రకాష్‌యాదవ్, భీష్మదేవ్, దిడ్డి రాంబాబు, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, పెంట రమేష్, కృష్ణాగౌడ్, సునీల్ బిడ్లాన్, బద్దుల శ్రీకాంత్, మహేష్, విజయ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్, ఎస్ఎస్ రాము తదితరులున్నారు.

శాస్త్రీయ కళలపై మక్కువ పెంచాలి



గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి చిన్ననాటి నుంచే శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సమృద్ధి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ 7వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య సంధ్య పేరిట పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ..కూచిపూడి కళారూపాన్ని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న నృత్య గురువును అభినందించారు. ఎస్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ రితూష్య, అంకుర ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ప్రతిభ నారాయణ్, సంస్థ నృత్య గురువు సంగీత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు మహిళలకు టికెట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ కొండా దేవయ్య, బండారు లత

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరుకాపు మహిళలకు సీట్లు ఇవ్వాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ప్రధాన రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మున్నూరుకాపు సంఘం మహిళా విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారి లత అధ్యక్షతన ఆదివారం నారాయణగూడలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు స్వశక్తితో రాణిస్తున్నా.. రాజకీయాల్లో మాత్రం మహిళలను ఎదగకుండా అన్ని పార్టీలు అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. మహిళా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించినప్పటికీ 33 శాతం రిజర్వేషన్ల అమలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు మహిళలు అందిస్తున్న సేవలను గుర్తించి టికెట్లు కేటాయించాలన్నారు. మహిళలను నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఆయన కోరారు. ఆర్.వీ.మహేందర్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, నిరంజన్, శివ, ఆకుల విక్రమ్‌కుమార్, కొండలరావు, సురేష్‌కుమార్, ఆకుల సుకన్య, సదాలక్ష్మి, శీలం మమత తదితరులున్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

బడంగ్‌పేట: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లో నిర్వహించిన వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమానవ సమానత్వం, శాంతి స్థాపనే లక్ష్యంగా హిందూ, ముస్లింలు కలిసిమెలిసి ఉండాలన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలతో సుస్థిర శాంతి నెలకొంటుందని, దేశంలో శాంతి, సామరస్యాలను పెంపొందించేందుకు మరింతగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమన్నారు.

బీఎన్‌రెడ్డి కాలనీలో లడ్డూ వేలం



లడ్డూను దక్కించుకున్న శ్రీధర్, శివారెడ్డి

చంపాపేట: బీఎన్‌రెడ్డి కాలనీలో బాలగంగాధర్ తిలక్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని లడ్డూలను ఆదివారం వేలం వేశారు. ఒక లడ్డూను స్థానికుడు గంటి శ్రీధర్ రూ.3 లక్షల 3 వేలకు, 2వ లడ్డూను రూ లక్షా 96 వేలకు దుడిపాల శివారెడ్డి వేలంలో దక్కించుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుల్తానా అల్వాలో..



లడ్డూతో సోమ వెంకటేష్ గుప్తా

చంపాపేట: చంపాపేట డివిజన్ సుల్తానా అల్వా కాలనీలో చైతన్య యూత్ అసోసియేషన్ వినాయక మండపంలోని లడ్డూను ఆదివారం స్థానికుడు సోమ వెంకటేష్ గుప్తా రూ. 75 వేలకు కైవసం చేసుకున్నాడు. అసోసియేషన్ సభ్యులు గణేశ్, మల్లేష్, విద్యాసాగర్, రాము, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకపక్క..కేటీఆర్ ప్రారంభోత్సవం మరోపక్క .. దివ్యాంగుల నిరాహార దీక్ష

మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీసుల్లో టెన్షన్...టెన్షన్

చాదర్‌ఘాట్: మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సోమవారం టెన్షన్ వాతావరణం నెలకొననుంది. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం మలక్‌పేటలో ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అదే సమయంలో చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలోని నల్గొండ క్రాస్‌రోడ్డు వద్ద వికలాంగుల జాతీయ పార్కు ప్రాంగణంలో దివ్యాంగులు నిరాహార దీక్ష చేపట్టనున్నారు. దీక్షకు రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు రెండు వేల మంది దివ్యాంగులు హాజరు కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దివ్యాంగులు దీక్ష చేపట్టే మార్గం నుంచే కేటీఆర్ ప్రారంభోత్సవానికి వెళ్లనుండటంతో పోలీసుల్లో ఆందోళన నెలకొంది. ఏ ఒక్కరూ తమ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నా వాతావరణం ప్రశాంతంగా ఉంటుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఎలాంటి గొడవలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీసులు వెల్లడించారు.

ఎంఎస్ స్వామినాథన్ సేవలు చిరస్మరణీయం



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాండురంగ చారి తదితరులు

నాగోలు: భారత హరిత విప్లవ పితామహుడు ప్రపంచ ప్రజల ఆకలి తీర్చేందుకు ఎనలేని కృషి చేశారని, ఆయన సేవల చిరస్మరణీయమని వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయబండి పాండురంగ చారి అన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి వెన్నపూస పరశురాజ్, బీసీ సంఘం నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాండురంగ చారి మాట్లాడుతూ, ఎంఎస్ స్వామినాథన్ సేవలకు గుర్తింపుగా రామన్ మెగసే అవార్డుతో పాటు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు 100 పైగా వచ్చాయన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు భారత జాతీయ వ్యవసాయంపై స్వామినాథన్ పలు సిఫార్సులు చేశారని, వాటిని అమలు చేయకపోవడం దేశాభివృద్ధితోపాటు వ్యవసాయంతో పాటు చేతి వృత్తిదారుల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. బీసీ సంఘం నాయకులు వెంకటస్వామి గౌడ్, కొప్పు యాదయ్య, అబ్బయ్య, నరేందర్, మల్లోజుల శేఖర్ చారి, దెండె అయోధ్య పాల్గొన్నారు.

పేద రజకులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య

సైదాబాద్: అర్హులైన పేద రజకులకు ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరె బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సైదాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ, సొంత స్థలం ఉండి ఆర్థిక స్తోమత లేని రజక కుటుంబాలకు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. బీసీ ఏ గ్రూపులోని కులాలకు ఇప్పటి వరకు మూడు విడతలుగా ఇవ్వాల్సిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఒక్క విడత మాత్రమే ఇచ్చి ఊరుకుందన్నారు. నిరుపేద రజకుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు వద్నాల మడేల్, నిరంజన్, వెంకటయ్య, ప్రియాంక, తులసి, యాదగిరి, ప్రేమలత, రేణుక, అనిత, బాలమ్మ, గిరి పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన రౌడీషీటర్ అరెస్టు



కత్తిపోట్లకు గురైన ఫెరోజ్



రౌడీషీటర్ ఇబ్రహీం

చంచల్‌గూడ: ఇంటికి వెళ్లి మొబైల్ ఫోన్ తస్కరించడమే కాకుండా తిరిగి ఇవ్వమన్నందుకు యువకుడిపై కత్తితో దాడి చేసిన రౌడీషీటర్‌ను శనివారం రాత్రి మాదన్నపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలు సుల్తానా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... ధాతునగర్‌లో నివసించే బాధితురాలి ఇంటికి గత గురువారం ఆమె కుమారుడు ముఖీబ్ మిత్రుడైన రౌడీషీటర్ ఇబ్రహీం వచ్చి మొబైల్ ఫోన్ చోరీ చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని రెయిన్ బజార్‌లో నివసించే తన సోదరుడు విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి మహ్మద్ ఫెరోజ్ (30)కు చెప్పింది. శుక్రవారం బాధితురాలు సోదరుడు ఫెరోజ్‌తో కలిసి నిందితుడు ఇబ్రహీం ఇంటికి వెళ్లి మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వాలని అడిగింది. అతను వారితో గొడవకు దిగి భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో బాధితులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్తుండగా, నిందితుడు ఇబ్రహీం వారిని వాటర్ ట్యాంక్ వద్ద అడ్డగించాడు.ఫెరోజ్ పై కత్తితో దాడి చేయడంతో అతను మాదన్నపేట పీఎస్‌కు పరుగులు తీశాడు. పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై ఐఎస్ సదన్ పీఎస్‌లో రౌడీషీట్ ఉంది. ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కె సునీల్ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఆరోపించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 3న ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద 1969 ఉద్యమకారులతో మహాధర్నా చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాలన్నింటిలో తెలంగాణ ఉద్యమమే కీలకమన్నారు. రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదిన్నర ఏళ్లు గడుస్తున్నప్పటికీ నాటి ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, కె.మోహన్‌రావు, రచ్చ సుభద్రారెడ్డి, ఎ.వెంకటయ్య, కె.బాలయ్య, అరుణ పాల్గొన్నారు.

హిందూ సంస్కృతిపై అవగాహన పెంపునకు కృషి



కాచిగూడ: హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజీ అన్నారు. కాచిగూడ తుల్జాభవన్ ధర్మశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన దూప, దీప, నైవేద్య అర్చకుల పునఃశ్చరణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ దిశగా అర్చకులకు దూప, దీప, నైవేద్యం కింద ప్రతినెలా రూ.10వేలు అందిస్తుందన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఎంపిక చేయబడిన ఆలయాల పూజారులను గుర్తించి వారికి మన సంస్కృతి, సంప్రదాయాలు, పూజా విధానాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో దైవభక్తిని పెంపొందించే విధంగా భక్తులు ఆలయాలకు వచ్చి పూజలు చేస్తూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునే విధంగా అర్చకులు కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 3వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, తుల్జాభవన్ ఈఓ అంజనారెడ్డి తదితరులున్నారు.